క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి శనివారం తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఉదయం 10 గంటలకు స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కొనకనమిట్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించి పోలీస్ వారికి సహకరించాలని ఎస్ఐ కడలి దీపిక కోరారు. శనివారం ఆమె కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ శనివారం నుంచి సోమవారం వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేస్తామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లు ఉన్నారు.

30 మందికి ఉద్యోగాలు


ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్, సంస్థల ప్రతినిధులు

ముండ్లమూరు: మండలంలోని పోలవరం వద్ద వేదా ఫార్మసీ కాలేజీలో శనివారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 30 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. మెడి అసిస్ట్ ఇండియా, కివీస్ జనరిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు 150 మంది హాజరు కాగా 30 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

మాలకొండ ఆదాయం రూ.8,84,363

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,84,363 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.24,360, తలనీలాలు రూ.31,050, ప్రత్యేక దర్శనం రూ.2,03,800, లడ్డుప్రసాదాలు రూ.1,81,655లు, అన్నదానం రూ.3,73,038, రూమ్‌అద్దెలు రూ.33,800 వచ్చినట్లు పేర్కొన్నారు.

131 పొగాకు బేళ్లు కొనుగోలు


కనిగిరి రూరల్: కనిగిరి టుబాకో కేంద్రంలో శనివారం మూడు రోజు కూడా 131 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలానికి 181 బేళ్లు రాగా 50 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.195 పలికింది. సోమవారం మాచవరం, భూతంవారిపల్లి, పోలవరం, రాచగుండ్లపాడు రైతులు బార్నీకి మూడు బేళ్ల చొప్పున వేలం కేంద్రాలకు తీసుకురావాలని వేలం నిర్వాహణాధికారి పీకే వీరభద్ర తెలిపారు.

27 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 27 పొగాకు బేళ్లు తిరస్కరించారు. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 521 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 483 కొనుగోలు జరిగగా, 27 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ. 200 కాగా, కనిష్ట ధర రూ. 195 పలికింది.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



ఒంగోలు అర్బన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్ఫూర్తిదాయకమైన అంశాలను విద్యార్థులకు తెలిపారు. ఆడపిల్లలు సోషల్ మీడియా ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.తల్లిదండ్రులను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ముఖ్యంగా మూడు అంశాలను సంకల్పించుకుని విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులతో ఏదో ఒక రోజు భుజం తట్టించుకుని శభాష్ అనిపించుకోవాలని, చదువుకున్న కాలేజీకే ముఖ్య అతిథిగా వచ్చేలా ఎదగాలని, అబ్దుల్ కలాం చెప్పినట్లు సంతకం ఆటోగ్రాఫ్ అయ్యేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కరస్పాండెంట్ రామకృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి


బ్యాలెట్ నమూనా చూపుతున్న ఎమ్మెల్యే కేపీ


ముండ్లమూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి


కురిచేడులో ఓట్లు అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, నాయకులు

మార్కాపురం టౌన్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలకు ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యం ఓటు-1 వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గంలోని పట్టభద్రులు 13న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు వైఎస్ జగన్ ప్రభుత్వంలో లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గమనించి మేధావులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ విజ్ఞప్తి చేశారు.

దర్శి: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులైన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలో వార్డు కౌన్సిలర్‌లు మేడగం మోహన్‌రెడ్డి, వీసీ రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తాళ్లూరి బాబూరావు, అవుల శివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డిలు శనివారం ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రచారం చేసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నపూస శేషిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంజి వెంకటేశ్వరరెడ్డి, సోము దుర్గారెడ్డి, రహంతుల్లా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ: వైఎస్సార్ సీపీ మద్దతు గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీచర్స్ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డిలను గెలిపించాలని జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, ఎంపీటీసీ జాన్ మార్క్ కోరారు. మండలంలోని చందవరం, పోలేపల్లి గ్రామాల్లో వారు శనివారం పర్యటించి ఓటర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో గ్రాడ్యుయేట్‌లకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు.

కురిచేడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డిలకు తొలి ప్రాధాన్యం ఓట్లు వేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. మండలంలోని పడమరవీరాయపాలెం, వెంగాయపాలెం, పొట్లపాడు, కురిచేడు తదితర గ్రామాల్లో ఆయన నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆయన ఫోన్‌లో మాట్లాడి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కురిచేడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గోగులముడి లింగారెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, నుసుం ప్రతాప్‌రెడ్డి, బొరిగొర్ల గోవిందు, పోకూరి సుబ్బారావు, సచివాలయం కన్వీనర్ కొలూరి నర్సింహులు, షేక్ మాలాలీ, వడ్డే రమేష్, మాలపోలు జత్రయ్య, నుసుం సత్యనారాయణరెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ముండ్లమూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ముండ్లమూరు, ఉమామహేశ్వరపురం, పూరిమెట్ల, ఈదర, రమణారెడ్డిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నమూనా బ్యాలెట్ పత్రాలు ఓటర్లకు అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డిలకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మేడికొండ జయంతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలెపోగు డగ్లస్, తాతపూడి శాంతకుమార్, సాల్మన్ పాల్గొన్నారు.


దర్శి 8వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


దొనకొండలో గ్రాడ్యుయేట్‌తో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం


ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు. భక్తులు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జయంతి

యర్రగొండపాలెం: స్థానిక మాచర్ల రోడ్డులో వెలసిన యాగంటి నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జయంతి (జాతర) ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు గణపతి పూజ, పంచామృత అభిషేకం, పుట్టింటి వారి పసుపు కుంకుమ కార్యక్రమం, పట్టు వస్త్రాల సమర్పణ, అమ్మ వారికి ప్రత్యేకాలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరణ, భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 10 గంటల నుంచి కోలాటం, భజన, భక్తులకు అన్నసంతర్పణ ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కష్టపడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, నాయకులతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ, మండల నాయకులు, సచివాలయ కన్వీనర్‌లకు పూర్తి సహకారం ఇవ్వాలని కోరారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాన్ని వివరించాలని, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన విధానాన్ని తెలపాలని సూచించారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ, పేద, బలహీన వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. గతంలో చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శ్రీనివాసులు, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యేలం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

మార్కాపురం: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి సమస్య ఉండే గ్రామాలను అధికారుల ద్వారా తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించాలని కోరారు. మండలంలో పారదర్శక పరిపాలన జరుగుతుందని, ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, సమ్యసలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ఎంఈఓ రాందాస్ నాయక్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారన్నారు. త్వరలో మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు రాగిజావా కూడా అందిస్తామని పేర్కొన్నారు. నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ట్యాబ్లెట్స్ అందిస్తున్నామని, వైద్యుల సూచన మేరకు విద్యార్థులకు వాటిని వేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. 9 గంటల పాటు ఉదయం పూట రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఏఈ సుబ్బారాయుడు తెలిపారు. దొంగ కరెంటు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానా విధించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మీటర్, విద్యుత్ స్తంభాలు, లైన్లు కావాల్సిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కారిస్తామని ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి చెప్పారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, సూక్ష్మ మధ్య తరహా కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రినాథ్ పాల్గొన్నారు.

వధూవరులకు నేతల ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి బాలినేని, ఎమ్మెల్యేలు

పొదిలి రూరల్: పొదిలి పాతూరి సాయి కల్యాణ మండపంలో శనివారం ఉడుముల వారి వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగ జరిగింది. కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సోదరుడు, కొనకనమిట్ల మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి కుమారుడి వివాహానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తరలి వచ్చారు. వధూవరులు స్వరూప్‌రెడ్డి, నిఖితరెడ్డిలను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబు, బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ మ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, సత్తెనపల్లి పార్టీ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీకృష్ణ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, విద్యుత్ సీఎండీ పద్మ జనార్దనరెడ్డి, డీపీఓ నారాయణరెడ్డి, దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఉన్నారు.

సిస్టర్ విజయరాణికి అభినందనలు

దొనకొండ: స్థానిక ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఏరువ విజయరాణి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం అభినందనీయమని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆర్‌సీఎం పాఠశాలలో శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి జంతు శాస్త్రంలో డాక్టరేట్ పొందటం గర్వకారణమని ఎంపీపీ అన్నారు. విజయరాణి డాక్టరేట్ పొందటం ఉపాధ్యాయులకు గర్వకారణమని ఎంఈఓ అన్నారు. అనంతరం ఆమెను ఎంపీపీ, ఎంఈఓ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.


సిస్టర్ విజయరాణిని సన్మానిస్తున్న ఎంపీపీ ఉషా, ఎంఈఓ సాంబశివరావు

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ కిశోర్‌కుమార్



మార్కాపురంలో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

కంభం: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక సీఎల్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత తెలిసీ తెలియని వయసులో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని జీవితాలు కోల్పోతున్నారన్నారు. యువత పెడదారిలో పడకుండా చదువుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండేందుకు కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి అందులో సభ్యులుగా కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులను సభ్యులుగా చేర్చాలన్నారు. సీఐ రాజేష్‌కుమార్, ఎస్ఐ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మార్కాపురం: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీఐ భీమానాయక్ తెలిపారు. శనివారం స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాల, డాక్టర్ శ్యాముల్ జార్జి కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్‌తో వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడితే శారీరకంగా, మానసికంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడతారని, విలువైన జీవితాన్ని కోల్పోతారని హెచ్చరించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉష ఈశ్వరన్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు, మద్యానికి యువత దూరంగా ఉండాలని, క్షణికావేశంలో పొరపాటు చేయవద్దని సూచించారు. రూరల్ ఎస్.సుమన్, జార్జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, ఇందిరా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరారెడ్డి, అబ్దుల్ కలాం, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రూ.12 లక్షలతో ఆలయాభివృద్ధి


గంగమ్మతల్లి ఆలయ ముఖద్వారం

కొనకనమిట్ల: వెలుగొండ క్షేత్రంలో గతేడాది నిర్మించిన గంగమ్మతల్లి ఆలయానికి సంబంధించి ముఖద్వారం, కళా వేదికను రూ.12 లక్షల సొంత నిధులతో నిర్మించినట్లు శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు మోడి అంజనేయులు, కోటేశ్వరరావు తెలిపారు. యదవ అన్నదాన సత్రం ఆవరణలో రూ.7 లక్షలతో కళా వేదిక నిర్మించామన్నారు. యాదవ అన్నసత్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాదం వీరయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, పిన్నిక నాగేశ్వరరావులు సత్రం అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తున్న దాతలను అభినందించారు. సత్రం బయట ప్రహరీ నిర్మాణం, ముఖద్వారం నిర్మాణానికి రిటైర్డ్ ఐజీ పిన్నిక హరికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయటం అభినందనీయమన్నారు. 16న జరిగే తిరునాళ్ల నాటికి ముఖద్వారం నిర్మాణం పూర్తి చేస్తామని పిన్నిక బ్రదర్స్ తెలిపారు.

కరూర్ గేదెలతో అధిక పాల దిగుబడి

ముండ్లమూరు: కరూర్ గేదెలతో అధిక పాల దిగుబడి వస్తుందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం హనుమంతరావు తెలిపారు. చెన్నై రాష్ట్రం కరూర్‌లో రైతులు కొనుగోలు చేసిన గేదెలను శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చిన సందర్భంగా వాటిని ఆయన శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు గేదెలు కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం ద్వారా గేదెలు, పొట్టేళ్లు, గొర్రెలు కొనుగోలుకు పావలా వడ్డీకే రుణాలు అందజేస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి గేదెకు బీమా చేయిస్తామని చెప్పారు. సీసీ గురవయ్య, రైతులు పాల్గొన్నారు.

వెలుగొండలో బ్రహ్మోత్సవం

- సింహ వాహనంపై శ్రీవారి ఉత్సవం


అలంకరణలో ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పల్లకిలో అలంకరించిన సింహ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధుల్లో ఉత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు, ఉభయదాతల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమార్‌శర్మ, సింహాద్రిచార్యులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. మొక్కుబడి భక్తులు తలనీలాలు సమర్పించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆదివారం శ్రీవారు హంస వాహనంపై శ్రీవారి ఉత్సవ మూర్తులకు ఉత్సవం జరుగుతుందని ఆలయ మేనేజర్ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.